# 17

# మీరు దేవున్ని నమ్మవచ్చు

## (మత్తయి 7:7-11)

ప్రార్థన – దీనికంటే అమూల్యమైనది, అవసరమైన అంశం మరొకటిలేదు. జాన్ వాలక్ (1802–1870) అను స్కాట్ దేశపు బోధకుడు యిలా వ్రాశాడు, "ఈ ప్రపంచాన్ని కదిలించే హస్తాన్ని కదిలించేది ప్రార్థన."[1] "ఈ లోకం కంటున్న ఎన్నో పనులు ప్రార్థన ద్వారా జరిగిపోతున్నాయి" అని బ్రిటీష్ రచయిత ఆల్ఫ్రెడ్ టెన్నీసన్ (1809–1892) పేర్కొన్నాడు.[2] అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ (1809–1865) అమెరికా యుద్ధ సమయం గురించి ఉదహరిస్తూ యిలా అన్నాడు, "ఇటువంటి కష్ట సమయాల్లో నాకు ఎక్కడికి వెళ్ళాలో తెలియదు, అనేకమార్లు మోకాళ్ళమీద ఉండడానికే నేను నడిపించబడ్డాను."[3]

కొండమీది ప్రసంగంలోని మునుపటి పాఠాలలో ప్రార్థన గురించిన సూచనలు మరియు ప్రోత్సాహమునే మనం చూశాం. మత్తయి 6:5–8లో మనం ఏవిధంగా ప్రార్థించ*కూడదన్న* విషయాన్ని చూశాం: "ఇతర మనుష్యులకు కనబడునట్లుగా మనం ప్రార్థించకూడదు." 6:9–15లో ప్రార్థన *ఏ విధంగా* చేయాలో నేర్పించే "మాదిరికర ప్రార్థనను" మనం చూశాం. ఇప్పుడు 7:7–11లో మనం ప్రార్థించేటప్పుడు మనం *దేన్ని ఆశించాలన్న* విషయాన్ని యిక్కడ చూస్తాం.

మత్తయి 7:7–11 వాక్య భాగం, "యితరులతో సభ్యతగా ఉండుట ఎలా" అన్న అంశమునకు సంబంధించియుంది, కాబట్టి దీనిని గురించి మునుపటి పాఠములో క్లుప్తంగా చూశాము.[4] ఈ పాఠములో ఈ వాక్యభాగమును మరింత నిశితంగా పరిశీలిస్తాము. ప్రార్థనా శక్తిని తెలియజేసే వాక్య భాగాలలో ఇది నాకిష్టమైనది. "అత్యంత సన్నిహితమైన, అత్యంత కృపగల, మనకు తగిన [దేవుని సహాయం] మానవుని చెవులకు దయచేయబడడం ఈ ప్రార్థన" అని స్టాన్లీ ఈ. జోన్స్ ప్రార్థనను వివరిస్తున్నాడు.[5] ఈ పాఠమునకు నేను "మీరు దేవున్ని నమ్మవచ్చు" అన్న శీర్షికను యిచ్చాను.

### మీ ప్రార్థనలకు సమాధాన మియ్యుటకు (7:7, 8)

*మీ ప్రార్థనలకు జవాబు దొరకడానికై* మీరు దేవుని నమ్మవచ్చునని ఈ వాక్య భాగం బోధిస్తుంది: "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును" (7, 8 వచనాలు) అని యేసు చెప్తున్నారు.

#### ఎడతెగని ప్రార్థన

7, 8 వచనాలలో మనకు కనిపించే ప్రాముఖ్య పదాలు "అడుగుట," "వెదకుట," మరియు "తట్టుట." "అడుగుట" అను పదం ఆశను సూచిస్తుంది. ఫిలిప్ బ్రూక్స్ ప్రార్థనను యిలా నిర్వచిస్తున్నాడు: "దేవున్ని అడిగిన ఒక కోరిక."[6] అలాగే "అడుగుట" అను పదం

దేవునిపై ఆధారపడుటను సూచిస్తుంది.[7] "వెదకుట" అను పదం ఆవశ్యకతను సూచిస్తుంది. "మీరు నన్నువెదకిన యెడల, పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేసినయెడల, మీరు నన్ను కనుగొందురు" అని యిర్మీయా 29:13లో వ్రాయబడింది. "తట్టుట" అనే పదం *భద్రపరచుటను* సూచిస్తుంది. లూకాలోని దీని సారూప్య వాక్యభాగంలో యేసు ఒక ఉపమానాన్ని తెలియజేస్తున్నారు (11:9–13) ఒక మనుష్యుని ఇంటికి అనుకోని అతిథి రావడంవలన తన స్నేహితుని యొద్దనుండి ఆహారం విషయమై "లేదు" అన్న సమాధానం పొందిన ఒక మనుష్యుని ఉపమానమిది (5–8 వచనాలు).

"అడుగుట" నుండి "వెదకుట," అక్కడనుండి "తట్టుటకు" వెళ్ళుటతో దీని తీవ్రత అధికమవుతుందన్న సత్యాన్ని అందరూ అంగీకరిస్తారు. దీనిని ఒక రచయిత ఒక పిల్లవాని కథ రూపంలో వివరించాడు.[8] ఒక పిల్లవానికి తన కాలికి దెబ్బ తగిలితే తన తల్లిని పిలుస్తాడు. ఒకవేళ తనకు ఏ జవాబు రానట్లయితే, అతడు తన తల్లి ఎక్కడ ఉందని వెదుకుతాడు. ఆఖరికి తన తల్లి ఆమె గదిలో తలుపు వేసుకుని ఉండడం గమనించి ఆమె పలికేవరకు ఆ తలుపును కొడుతూనే ఉంటాడు. మరో రచయిత దీన్ని ఒక వ్యక్తి తన స్నేహితుని ఆచూకీ కనుగొనడం గురించిన కథగా వివరించాడు.[9] ఆ వ్యక్తి తన స్నేహితుని జాడ కోసం అందరినీ అడుగుతాడు. అతడు ఎక్కడ ఉన్నాడాయని అతడిని వెదకుతాడు. అతన్ని కనుగొన్న తరువాత అతడింటికి వెళ్ళి తలుపు తడుతాడు.

"అడుగుట" (ask) అన్న పదం ఇంగ్లీషు మాట "అ" (a)తో ప్రారంభమవ్వగా, "వెదకుట" అన్న పదం యొక్క ఇంగ్లీషు మాట "వె" (s)తో ప్రారంభమవ్వగా, "తట్టుట" అన్న పదం యొక్క ఇంగ్లీషు మాట "త" (k)తో ప్రారంభమయ్యింది. ఈ అక్షరాలన్నిటిని కలిపితే ఆశ్చర్యకరంగా తిరిగి "ask" అన్న పదమే వస్తుంది. మనం దేవున్ని అడగాలని ఆయన కోరుకుంటున్నాడు. "దేవుని అడగనందున మీకేమియూ దొరకదు" (4:2) అని యాకోబు అంటున్నాడు. మనం ఒక్కసారి అడిగి ఊరకుండవలెనని యేసు మనలను కోరుటలేదు. మనం అదేపనిగా అడుగుతూ ఉండవలెనని, ఎడతెగక అడగవలెనని ఆయన మనలను కోరుతున్నాడు. "అడుగుట," "వెదకుట," "తట్టుట" అన్న మాటలు గ్రీకు భాషలో వర్తమాన కాలంలోనున్నాయి. ఇవి జరుగుతున్న పనిని సూచిస్తున్నాయి. "అడుగుతుండుడి," "వెదకుతూనుండుడి," "తట్టుతూనుండుడి" అని ABలో పేర్కొనబడింది. "విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెను" అని యేసు తన శిష్యులకు బోధించారు (లూకా 18:1).

## శక్తివంతమైన వాగ్దానం

మనం ప్రార్థనలో ఎడతెగక యున్నట్టయితే, మనకు ఒక గొప్ప వాగ్దానం చేయబడింది, "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును" (7 వచనం). మనం యిందులోని సారమును పోగొట్టుకొకుండవలెనని ఈ వాగ్దానాన్ని మరోసారి తెలియజెప్పి, దాన్ని బలపరుస్తున్నాడు, "అడుగు ప్రతివాడును పొందును, వెదకు వానికి దొరుకును, తట్టువానికి తీయబడును" (8 వచనం).

యేసు యొక్క మాటలు మన జీవితంలోని ప్రతి సందర్భానికి అన్వయించబడతాయి – ఒక విషయంలో నైపుణ్యతను సాధించుటకు యత్నిస్తున్నా, సంపాదన విషయంలోనూ, మన ఆరోగ్యాన్ని భద్రపరచుకొను విషయంలోనూ లేదా మరింకేదయినా లక్ష్యాన్ని సాధించుటకు

ప్రయత్నిస్తున్నా గాని, ఏ విషయంలోనయినను ఈ మాటలు వర్తించబడతాయి. మనం దేన్నయనా సాధించాలనుకున్నప్పుడు దాన్ని సాధించేటప్పుడు ఎంతో కష్టపడతాం. కొన్ని విషయాలు మాత్రం అంతగా కష్టపడకుండానే నెరవేర్చబడతాయి. ఇది ఈ లోకంలో జరిగేదే! ఆత్మీయ విషయంలో మాత్రం ఇది మరింత సత్యం. దేవునిచేత ఆశీర్వదించబడుటకు మనకు ఆశవున్నట్లయితే మనం తప్పనిసరిగా అడగాలి, శ్రద్ధతో వెదకాలి. అలాగే ఎడతెగక తడుతూ ఉండాలి. మనమీ పనులను చేసినప్పుడు మనం పొందుతుంటామని, మనకు దొరకుతుందని, ఆశీర్వాదమనే తలుపులు తెరువబడతాయని యేసు వాగ్దానం చేస్తున్నారు.

ఒకవేళ వాక్యములో ఏదయినా విషయం స్పష్టముగా పేర్కొనబడినదంటే అది దేవుడు ప్రార్థన ఆలకించుటను గురించియే! "పరిశుద్ధ గ్రంథంలో ప్రత్యేకంగా మనవి చేయబడిన 667 ప్రార్థనలలో 454 ప్రార్థనలకు ఖచ్చితమైన జవాబులు లభించాయి."[10] దేవుడు ప్రార్థనకు జవాబివ్వుటను గురించి పరిశుద్ధ గ్రంథంలో తమకు యిష్టమైన వాక్య భాగములను ఉదహరించమని నా బైబిలు క్లాసును కోరినప్పుడు వారు అందించినవాటిలో కొన్ని ఇవి:[11]

> నేను యెహోవాయొద్ద విచారణచేయగా ఆయన నాకుత్తరమిచ్చెను నాకు కలిగిన భయములన్నిటిలోనుండి ఆయన నన్ను తప్పించెను (కీర్తనలు 34:4).
>
> "అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి; అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాననెను" (మార్కు 11:24).
>
> నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును (యాకోబు 5:16బి).
>
> మనమేమి అడిగినను అది ఆయన వలన మనకుదొరుకును (1 యోహాను 3:22ఎ).

దేవుడు మన ప్రార్థనలకు జవాబునివ్వడం గురించి ఇంకా ఎన్నో వాక్యభాగములను నేను పేర్కొనవచ్చు గాని మన వాక్య భాగం వలె స్పష్టంగా, శక్తివంతముగా వివరిస్తున్న వాక్య భాగం మరొకటి మనకు కనబడదు. "అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడును." డి. మార్టిన్ లాయిడ్ జోన్స్ యిలా వ్రాస్తున్నాడు, "మన జీవితంలో ఎదుర్కొనే భయంకర పరిస్థితులు, అపాయకర సమయాలకు తగిన ప్రోత్సాహకర మాటలు, ఆదరణ వచనాలు దీనికంటే ఎక్కడా ఉండవేమో! మనకు కేవలం బైబిలులోనే కనబడే కృపగల వాగ్దానాలలో ఇది కూడ ఒకటి."[12]

"ఒక్క నిమిషము ఆగండి! దేవుడు నా ప్రార్థనకు జవాబివ్వలేదు. అడిగి అడిగి నా గొంతు బొంగురు పడిపోయింది. వెదకి వెదకి వేసారిపోయాను. తట్టి తట్టి నా చేతులు దెబ్బ తిన్నాయి గాని నేనేది పొందలేదు, ఏదీ దొరకలేదు. తలుపు యింకా బిగించే ఉంది!" అని మీలో కొందరు వాదించవచ్చు. దేవుడు మన ప్రార్థనకు జవాబునిస్తాడని మత్తయి 7:7–11 వాక్య భాగం బోధిస్తుందే గాని, మనం చేసే ప్రార్థనకు దేవుడు వెంటనే "సరే" అనేలా ఆయన్ను ఒప్పించే మంత్రోచ్చారణ ప్రార్థన అన్న అసత్యాన్ని ఇది బోధించదు. మన ప్రార్థన అంగీకార యోగ్యమైనదైయుండవలెనంటే ప్రార్థనలోనున్న కొన్ని నియమముల గురించి వేరే వాక్య భాగములు బోధిస్తున్నాయి.

*ఆయన చిత్తానుసారం ఆయన్ను అడగాలి.* "ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేమనగా,

ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే" (1 యోహాను 5:14).

*మనము విశ్వాసముతో అడుగవలెను.* "అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను; సందేహించువాడు గాలిచేత రేపబడి యెగిరిపడు సముద్ర తరంగమును పోలియుండు" (యాకోబు 1:6, 7).

*నిస్వార్థముతో ప్రార్థనచేయాలి.* "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరుకుట లేదు" (యాకోబు 4:3).

మరలా కొంతమంది లేచి యిలా అనవచ్చు – "ప్రార్థనకు నియమములా? అన్ని నియమములకు సరిపడునంతగా మన ప్రార్థన ఉంటేనే దానిని దేవుడు అంగీకరిస్తాడన్న మాట! నాకు తెలుసు యిలాంటిది ఏదో ఒకటి ఉంటుందని!" ఈ విషయం గురించి తీవ్రంగా ఆలోచించండి. ప్రార్థనకు నియమములున్నందుకు మీరు సంతోషిస్తున్నారనుకుంటున్నాను. మనం అడిగిన వాటినన్నిటిని దేవుడు వెంటనే యిచ్చేస్తుంటే, యిది కల నెరవేరినట్లుంటుంది. కానీ యిది త్వరలోనే పీడకల అని తేలిపోతుంది. మనం రొట్టె, చేప కొరకు అడుగనుద్దేశించి రాళ్ళకోసం, పాముల కోసం దేవున్ని అడుగుతాం. అలెక్ మోయ్యార్ ఈ విధంగా వ్రాస్తున్నాడు:

> మనం ఏది అడిగినా గాని దేవుడు మనకు దయచేస్తుంటే, యిక నేను దేని గురించి ఎన్నటికీ ప్రార్థించను. ఎందుకంటే దేనికోసమైనా దేవున్ని అడిగే జ్ఞానము, ధైర్యము నాకు లేదు; దీని గురించి ఆలోచిస్తే, మీరూ నాతో ఏకీభవిస్తారు. మనమేది అడగినా గాని వెంటనే ఇస్తానని దేవుడు వాగ్దానం చేస్తే మనము అడిగినదాన్ని బట్టి దుర్భలమైన ఈ మానవ జ్ఞానం పై భరించలేని భారం పడుతుంది. యిటువంటి భారాన్ని మనం ఎలా భరించగలం?[13]

ఏదేమైనా, దేవుడు తన పిల్లల ప్రార్థనలకు సమాధానమిస్తాడన్న ఆయన అద్భుత వాగ్దానంనుండి మనం వేరైపోకుండా ఉందాము. ఆయన అన్నివేళలా "అవును" అన్న సమాధానమియ్యడు గాని సమాధానమిస్తాడు. ఒక బోధకుడు దేవుడిచ్చే సమాధానాలు ఈ విధంగా ఉంటాయని వివరిస్తున్నాడు:

- మన మనవి అంగీకార యోగ్యమైనది కాకపోతే, ఆయన *"కాదు"* అని అంటాడు.
- మనం అడిగే సమయం సరయినది కాకపోతే, ఆయన *"నిదానించు"* అని అంటాడు.
- మనమే సరయినవారం కాకపోతే, *"యింకా ఎదుగు"* అని ఆయన అంటాడు.
- ఒకవేళ మన మనవి, మనం అడిగే సమయం, మనం సరయిన వారమయితే, *"సరే పదా"* అని ఆయన అంటాడు.[14]

వాక్యము ప్రకారం, మన ఈ జీవితం కష్టాలు, శ్రమలతో కూడిన ఒక యాత్ర.[15] ఈ లోకంలో మనకు ఎదురయ్యే వాటిని ఎదుర్కొడానికి మనం సిద్ధంగా ఉన్నా, లేకపోయినా అవి మనలను అంతగా బాధించవు. అయితే ఈ లోకంలో మనకు ఉన్న నిశ్చయత ఏమిటంటే దేవుడు మన ప్రార్థనకు జవాబిస్తున్నాడు అన్న విషయమే!

### మీకు మంచి యీవులనిచ్చుటకు (7:9–11)

దేవుడు మన ప్రార్థనలకు జవాబిస్తున్నాడు కాబట్టి మీరు ఆయన్ను నమ్మవచ్చు. అలాగే

ఆయన మీకు *మంచి యీవులనిస్తున్నాడు* కాబట్టి మీరు ఆయన్ను నమ్మవచ్చు.

**ఈ లోకంలోని తండ్రులు (9, 10 వచనాలు)**

ఈ భాగంలో యేసు ప్రభువు ఈ లోకంలోని తండ్రుల గురించి మాట్లాడుతున్నారు. "మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగిన యెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగిన యెడల పాము నిచ్చునా?" (9, 10 వచనాలు).[16] కొండమీద ప్రసంగం గలిలయ ప్రాంతంలో చేయబడింది. గలిలయ ప్రాంతంలో సాధారణ భోజనమునకు రొట్టె మరియు చేపను ఉపయోగిస్తారు. (యోహాను 6:9లోని చిన్న పిల్లవాని ఆహారం గుర్తుందా?) అలాగే ఈ సముద్ర తీరం వెంబడి రాతి బండలు, గుట్టలు ఉంటాయి. ఈ రాళ్ళ సందుల్లో రకరకాల పాములు దాక్కుని ఉంటాయి.

కుమారుడు తన తండ్రిని రొట్టె అడుగుతున్న విషయాన్ని ప్రభువు మొదటి ఉదాహరణగా చెప్తున్నారు, "మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగిన యెడల వానికి రాతినిచ్చునా?" ఈ విషయంలో ఏ తండ్రి అయినా ఒక నల్లని గుండ్రని రాయిని[17] కొడుకు చేతిపై పెట్టి తినమని ఒక కౄర పరిహాసం చేస్తాడా? దీనికి జవాబు ఖచ్చితంగా "కాదు!"[18] రెండవ ఉదాహరణలో, పరిహాసం ప్రమాదంగా మారింది. చేప కాస్తా పాముగా మారింది. లెక్క ప్రకారం, పాములు చేపలకు సాదృశ్యంగా సూచించవచ్చునని కొంతమంది అభిప్రాయపడుతుంటారు (*ophis*). పొలుసులు లేని ఈల్ చేపలను సూచించవచ్చునని కొంతమంది అభిప్రాయపడుతుంటారు. పొలుసులు లేని చేపలు యూదులకు నిషేధించబడింది (లేవీయకాండము 11:12 చూడు). ఒకవేళ ఒక వ్యక్తి తన కుమారునికి పొలుసులు లేని చేపను ఆహారముగా యిస్తే ఆ వ్యక్తి తన కుమారుడిని ఆచారపరంగా అపవిత్రుడిగా చేసినట్లే? అది పాము అయినా, లేదా ఈల్ చేప అయినా యూదులకు ఇది ప్రమాదకరమైన పరిహాసం. ఆత్మీయంగానూ, మరియు భౌతికంగానూ ఇది ప్రమాదకరం, బాధ్యతగల ఏ తండ్రీ కూడ కుమారుని విషయంలో ఎన్నడూ యిలా చేయడు.

మన పరలోకపు తండ్రి యిలా చేయడన్న విషయాన్ని మనం అర్థం చేసుకోవాలని మననుండి ఆయన ఆశిస్తున్నాడు. యేసు కాలంలోని అన్యుల యొక్క దేవతలు ప్రమాదకరమైన కుయుక్తిని ప్రదర్శించేవారు. ఒక సామాన్య మానవునితో ప్రేమలో పడిన ఒక దేవతను గురించిన పురాణం ఒకటి గ్రీకులలో ఉండేది. ఆ దేవత యొక్క ప్రేమికునికై దేవుళ్ళ అధిపతి ఒక వరమును యిస్తానన్నాడు.[20] ఆ మానవుడు ఎల్లకాలం జీవించేలా వరమిమ్మని ఆ దేవత కోరింది కాని, ఆ వ్యక్తి శాశ్వత కాలం యవ్వనస్థుడిగానే ఉండనిమ్మని అడగలేకపోయింది. అతడు పెరిగి పెద్దవాడయ్యాడు, ముసలివాడయ్యాడు గాని మరణము నొందలేదు. అతనికి వరమే శాపమయ్యింది. కాని నిజ దేవుడు అలా కాదు.

**పరలోకపు తండ్రి (11 వచనం)**

యేసు యిక్కడ తన అన్వయింపును యిస్తున్నారు, ఈ లోకంలోని తల్లిదండ్రులు తమ పిల్లల మనవులకు ఏ విధంగా ప్రతిస్పందిస్తారో చెప్పిన తరువాత "మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును" అని ఆయన

చెప్తున్నారు (11 వచనం).

"దేవునితో పోల్చినప్పుడు అందరూ, కనికరముగల తల్లిదండ్రులు కూడా చెడ్డవారే!"[21] మనమందరము తప్పులు చేస్తుంటాం. నా కుమార్తెలు ఎదుగుతున్నప్పుడు, నేను వారి యెడల ఒక మంచి తండ్రిగా ఉండుటకు నేను చేయగలిగినదంతా నేను చేశాను. వారికి యిచ్చేటప్పుడు శ్రేష్ఠమైన వాటినే యిచ్చాను. కాని, యిప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే, నేను ఎన్నో తప్పులు చేశాను. నేను గుర్తించని తప్పులు యింకా ఎన్నో ఉంటాయి. మనవలే, మన పరలోకపు తండ్రి తన పిల్లల విషయంలో ఎటువంటి తప్పిదములను చేయలేదు. ఇందును బట్టి మనమెంతో కృతజ్ఞులమైయుండాలి! మనవలె కాకా ...[22]

(1) *తన పిల్లలకు ఏది మంచిదో అది దేవునికి తెలుసు.* నా కుమార్తెలకు ఏది మంచిదోనన్న విషయం నాకు అన్ని వేళలా తెలియదు, కాని దేవునికి తెలుసు. జాన్. ఆర్ డబ్ల్యూ. స్టాట్ ఈ విధంగా వ్రాసాడు: "... ఒకవేళ దేవున్ని మనం మంచి వాటిని అడిగితే, ఆయన వాటిని అనుగ్రహిస్తాడు, ఒకవేళ మనమాయన్ను మంచివి కాని వాటిని (అది మంచిది కాకపోవచ్చు లేదా అది మనకు మంచిది కాకపోవచ్చు లేదా యితరులకు మంచిది కాకపోవచ్చు, ప్రత్యక్షంగానూ లేదా పరోక్షంగానూ, తక్షణం లేదా చివరకు) అడిగితే ఆ మనవిని ఆయన తిరస్కరిస్తాడు." స్కాట్ తన మాటలను యిలా ముగిస్తున్నాడు, "ఆయనకు ఆ తేడా తెలుసు."[23]

(2) *తన పిల్లలకు ఏది మంచిదో అది ఆయన ఇవ్వగలడు.* నా పిల్లల విషయంలో నేను చేయగలిగింది చేశాను. కానీ, నాకున్న సమయం, శక్తి, డబ్బులు నన్ను పరిమితుడ్ని చేశాయి. దేవునికి యిలాంటి పరిమితులు, పరిధులు లేవు. మరియు "అన్నిటియందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వ సమృద్ధిగలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింపజేయగలడు" (2 కొరింథీయులకు 9:8) అని పౌలు చెప్తున్నాడు.

(3) *తన పిల్లల యెడల దేవుడు ఎప్పుడూ కనికరం చూపుతాడు.* మీ పిల్లలతో వ్యవహరించేటప్పుడు మీరు ఎప్పుడయినా సహనం కోల్పోయారా? నొప్పించే మాటలు లేదా పనులు చేశారా? నాకయితే అటువంటి క్షణాల్ని జ్ఞాపకముంచుకోవాలనిపించదు. నేను కోపంగా చిరాకుగా ఉన్నప్పుడు నా పిల్లల విషయంలో కఠినంగా వ్యవహరించాను. మనుష్యులకున్నటువంటి ఈ తప్పిదములు దేవునికి ఉండవు (యెషయా 49:15 చూడు).

(4) *తన పిల్లలకు అవసరమయినప్పుడు దేవుడు ఎప్పుడూ అందుబాటులో ఉంటాడు.* నా కుమార్తెలకు నా అవసరత ఉన్న సమయంలో వారికి నేను అందుబాటులో లేకుండా ఉన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. తన పిల్లలకు దేవుడు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాడు. "వారికి ఏది మంచిదో" యివ్వడానికి ఆయన ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. "నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా? దూరముననుండు దేవుడను కానా?" (యిర్మీయా 23:23).

"తనను అడుగు వారికి తండ్రి మంచి యీవులనిచ్చును" అని యేసు చెప్తున్నారు. మంచి యీవులు అంటే ఆయన దృష్టిలో ఏమయి ఉన్నాయి? లూకాలోని దీని సారూప్య వాక్య భాగంలో "మంచి యీవులు" అను మాటకు బదులు "పరిశుద్ధాత్మ" (11:13) అన్న మాట ఇయ్యబడింది. లూకా 11వ అధ్యాయంలో దేవుడు తన పిల్లలకు యిచ్చే ఆత్మీయ ఆశీర్వాదముల గురించి చెప్పబడింది.[24] యింతకుముందు చెప్పబడిన ప్రకారం, ఆయన

మనకు యిచ్చే మంచి యీవులు యివే! మత్తయి 7వ అధ్యాయములో భౌతిక ఆశీర్వాదం గురించి యియ్యబడింది. తన రాజ్యమును నీతిని మొదట వెదకువారికి భౌతిక ఆశీర్వాదములు దయచేయబడతాయని మత్తయి 6వ అధ్యాయం (6:33)లో చూస్తాం. మనం భౌతిక మరియు ఆత్మీయ ఆశీర్వాదముల కొరకు ప్రార్థన చేయవలెనని యేసు తన మాదిరి ప్రార్థనలో పేర్కొన్నారు (6:11, 12). కాబట్టి "మంచి యీవులు" అన్న పదం మన పరలోకపు తండ్రి యిచ్చే అన్ని యీవులను సూచిస్తుంది. "శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రియొద్దనుండి వచ్చును ..." (యాకోబు 1:17) అని యాకోబు వ్రాస్తున్నాడు.

"నేను దేవుని కుమారుడనే, అయినా నాకు ఆయన మంచి యీవిని ఏదియూ ఇవ్వలేదు. నిజానికి నాకు జరిగినవన్నీ చెడు కార్యములే!" అని కొంతమంది క్రైస్తవులు అనవచ్చు. యిటవంటి "చెడు కార్యములు" ఎందుకు జరిగాయో చెప్పగల జ్ఞానం, సమర్థత నాకు ఉంది. కానీ నేను చెప్పను కానీ, కొన్ని సత్యములు మీరు గ్రహించుటకు యిక్కడ ఉదహరిస్తాను.

మొదటిగా, మనకేది మంచిదో అది మనకు తెలియదు. మనకు తెలుసని మనం అనుకుంటాం. మన గురించి మనకు అంతా తెలుసనుకుంటాము. కానీ మనకు తెలియదు. నా నాలుగేళ్ళ మనవడికి చాక్లేట్లు తినడం మాత్రమే తనకు మంచిదనుకుంటాడు, కాని అది తప్పని అతనికి తెలియదు. మానవులముగా ఏది "మంచిదన్న" విషయం గురించి మనకు కొంచెమే తెలుసు.

రెండవదిగా, మనం ఏదయితే మనకు చెడు అని అనుకుంటామో అది మనకు ఆశీర్వాదంగా మారుతుంది. "నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొందియుండుట నాకు మేలాయెను" (కీర్తనలు 119:71) అని కీర్తనా కారుడు వ్రాస్తున్నాడు. అమెరికా యుద్ధ సమయంలో కాన్ఫిడరేట్‌కు చెందిన సైనికునికి సంబంధించిన మాటలను మీరు వినే ఉంటారు:[25]

> సాధించుటకు అతడు బలముకొరకు అడిగాడు; అందుకతడు లోబడునట్లు బలహీనునిగా చేయబడ్డాడు.
>
> గొప్ప కార్యాలను చేయునట్లు అతడు ఆరోగ్యమును అడిగాడు; మరిన్ని మంచి కార్యాలను చేయునట్లు అతడు నలుగగొట్టబడ్డాడు.
>
> సంతోషంగా ఉండునట్లు అతడు సంపదను అడిగాడు; జ్ఞానమును పొందునట్లు అతడు పేదవాడయ్యాడు.
>
> మనుష్యులచేత కీర్తిని పొందునట్లు అతడు శక్తిని అడిగాడు; దేవుని సహాయాన్ని ఎరుగునట్లు అతడు బలహీనం చేయబడ్డాడు.
>
> జీవితాన్ని ఆనందించడానికి అతడు అన్ని సౌఖ్యమును అడిగాడు; అన్ని సౌఖ్యమును ఆనందించడానికి అతడికి జీవితం యివ్వబడింది.
>
> అతడు అడిగిన వాటితో దేనిని అతడు పొందలేదు, గాని వాటికై నిరీక్షించడానికి అతడు అనుసరించబడ్డాడు.
>
> అతడి ప్రార్థన అంగీకరించబడి, జవాబియ్యబడింది.
>
> అతడే బహుగా దీవించబడ్డాడు.

మూడవదిగా, మనకేది మంచిదన్న విషయం దేవునికి మాత్రమే తెలుసు. కాబట్టి మన విషయాన్ని దేవుని హస్తాలకు అప్పజెప్పుదాం. యేసు ప్రార్థించిన విధంగా "నా యిష్టము

కాదు, నీ చిత్తమే సిద్ధించును గాక" అని ప్రార్థిద్దాం (లూకా 22:42బి).

**ముగింపు**

మనం అడగాలి, అడుగుతూనే ఉండాలి. మనం వెదకాలి, వెదుకుతూనే ఉండాలి. మనం తట్టాలి, తడుతూనే ఉండాలి. మనం యిలా ఎందుకు చేయాలి? దేవుడు పిసినారివాడా? మంచి యీవుల కోసం మనం వెంపర్లాడుతూనే ఉండాలా? కాదు. మనం వాక్య భాగాన్ని మొత్తం మీద పరశీలిస్తే, దేవుడు దయాళుత్వము గలవాడు, కనికరంగలవాడు కాబట్టి ఆ విషయాన్ని ఎరిగి మనం ప్రార్థనలో ఎడతెగక యుండవలెనని యేసు బోధిస్తున్నారు. ఒకవేళ మనం ఎడతెగక అడుగుతూ, వెదకుతూ, తట్టుతున్నట్టయితే మనం పొందకుంటాం, కనుగొంటాము అలాగే అది మనకు తెరువబడుతుంది.

మనం ఏది అడిగినా గాని, అడిగిన ప్రతిది, అడిగిన వెంటనే దేవుడు మనకు యిస్తాడని దీని అర్థమా? కాదు, మన ప్రతి కోరికను కాదనకుండ తీర్చుటకు దేవుడేమో మన తాత కాదు. కేవలం మనకు ఏది మంచిదో అది మాత్రమే ఆయన యిస్తాడు. అలాగే తన పిల్లల మీద జిమ్మిక్కులు, తంత్రములను ప్రయోగించుటకు దేవుడేమో మాయగాడు లేక హాస్యగాడు కాదు. మీరు దేవున్ని నమ్మవచ్చు. మీ ప్రార్థనలకు జవాబినిచ్చువానిగా మీరు దేవున్ని నమ్మవచ్చు. మీకు కేవలం మంచివాటిని మాత్రమే దయచేయువానిగా మీరు దేవున్ని నమ్మవచ్చు.

మత్తయి 7:7-11 వాక్య భాగం ఒక తండ్రి/కుమారుని సంబంధం పై ఆధారపడి యున్నదన్న విషయాన్ని మీరు గ్రహించాలి. ఇందులోని వాగ్దానాలు దేనిపై ఆధారపడి యున్నది. వీటిని మీరు పొందుకోవాలంటే, మీరు దేవుని కుమారుడవైయుండాలి. మీరు దేవుని కుమారులేనా! విశ్వాసం మరియు విధేయత ద్వారా మీరు ఆయన యొద్దకు వస్తున్నారా? "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" (గలతీయులకు 3:26, 27) అని పౌలు వ్రాస్తున్నాడు. మీరు దేవుని కుమారులైతే, మీరు విశ్వాసముగల కుమారులేనా? చాలా కాలం క్రితం. అవిశ్వాసులైన తన పిల్లలను గురించి "భ్రష్టులైన బిడ్డలారా, తిరిగి రండి; మీ అవిశ్వాసమును నేను బాగుచేసెదను" (యిర్మీయా 3:22ఎ) అని దేవుడు అంటున్నాడు. మీరు దేవుని కుమారులనబడగోరితే, లేదా మీరు అవిశ్వాసముగల పిల్లలయి దేవునియొద్దకు తిరిగి వచ్చుటకు యిష్టపడగోరితే ఇదియే సమయం (2 కొరింథీయులకు 6:2).

---

సూచనలు

[1]John A. Wallace (http://www.fullbooks.com/The-World-s-Best-Poetry--Volume-108.html. Internet; accessed 26 July 2008). [2]Alfred Tennyson, *Morte d'Arthur*, line 247; quoted in Frank S. Mead, comp. and ed., *The Encylopedia of Religious Quotations* (Westwood, N.J.: Fleming H. Revell Co., 1965), 348. [3]Abraham Lincoln; quoted in Frank S. Mead, comp. and ed., *The Encyclopedia of Religious Quotations* (Westwood, N.J.: Fleming H. Revell Co., 1965), 342. [4]"యితరులతో సభ్యతగా ఉండుట" అన్న మునుపటి పాఠములో మత్తయి 7:7-11 వాక్య భాగ అధ్యయనాన్ని గమనించవచ్చు. [5]E. Stanley Jones, *The Christ of the Mount* (New York: Abingdon Press, 1931), 256. [6]Mead, 337. [7]"ఆత్మయందు దీనత్వం" కలిగియుండాల్సిన అవసరం గురించి చూడండి (మత్తయి 5:3). [8]Richard Glover; alluded to in John R. W. Stott, *The Message of the Sermon on the Mount,* The Bible Speaks Today series (Downers Grove, Ill.:

Inter-Varsity Press, 1978), 184. [9]Jones, 278. [10]Eleanor L. Doan, comp., *The Speaker's Sourcebook* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1960), 193.

[11]కీర్తనలు 32:5; హెబ్రీయులకు 5:7; యాకోబు 1:5; 5:14, 15 చూడు. [12]D. Martyn Lloyd-Jones, *Studies in the Sermon on the Mount,* vol. 2 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1959), 195. [13]Alec Motyer, *Studies in the Epistle of James* (London: New Mildmay Press, 1968), 88. [14]Bill Hybels, *Too Busy Not to Pray,* rev. ed. (Downers Grove, Ill.: InterVarsity Press, 1998), 88. Emphasis added. [15]ఈ వాక్యం మరియు తరువాత వాక్యం లాయిడ్ జోన్స్, 195 నుండి తీసుకోబడింది. [16]దీని సారూప్య వాక్యం లూకా 11లో గ్రుడ్డు మరియు తేలు గురించి ఇయ్యబడింది (12 వచనం). పెద్ద తేలు గుండ్రంగా చుట్టుకుంటే గుడ్డు ఆకారంతో కనబడుతుంది. [17]"రొట్టె" అన్నప్పుడు పెద్ద రొట్టెను ఊహించకండి. ఇది చిన్న బన్నులాంటిది. మా ప్రాంతంలో ఇటువంటి వాటిని "డిన్నర్ రోల్సు" అంటారు. ఇవి గుండ్రంగా, బ్రౌను రంగులో ఉండి రాయిలా కనిపిస్తాయి. [18]యేసు అడిగిన రెండు ప్రశ్నలు నకరాత్మకం (*me*) గానే ఉన్నాయి. వీటికి సమాధానాలు కూడ నకరాత్మకం గానే ఉంటాయి: "లేదు, తండ్రి అలా చేయడు." [19]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 66. ఒక రచయిత యిలా ఉదహరిస్తున్నాడు, "the eel-like catfish of Galilee, *Clarias lazera"* (R. T. France, *The Gospel According to Matthew,* Tyndale New Testament Commentaries [Grand Rapids, Mich.: Inter-Varsity Press, 1985], 144). [20]Adapted from William Barclay, *The Gospel of Matthew,* vol. 1, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 275.

[21]David Hill, *The Gospel of Matthew,* New Century Bible Commentary series (London: Butler & Tanner Ltd., 1978), 149. పితృపారంపర్య దుర్నీతి సిద్ధాంతమును బోధించుటకు యేసు "చెడు" అన్న మాటను ఉపయోగించలేదు. [22]The following list was suggested in W. Robertson Nicoll, ed., *The Sermon Outline Bible: Matthew 1-21* (Grand Rapids, Mich.: Baker Book House, 1958), 182. [23]Stott, 189. [24]రోమీయులకు 8 ప్రకారం మనమిప్పుడు అనుభవిస్తున్న అనేకమైన ఆత్మీయ వరాలు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా పరిశుద్ధాత్మునికి సంబంధించినవే. [25]Quoted in Ralph Sweet, *Moments on the Mount,* Living Word series (Austin, Tex.: R. B. Sweet Co., 1963), 65.

## "సార్వత్రిక రక్షణ"?

మత్తయి 7:7-11 వాక్య భాగంలోని తన పిల్లలతో దేవునికున్న సంబంధం మానవ తండ్రికి తన కుమారునితోనున్న సంబంధముతో పోల్చబడింది. దేవునికి మానవులతో ఇయ్యబడిన ఏ పోలిక అయినా ఆ సంబంధిత వాక్య భాగానికి మాత్రమే పరిమితమైయుండాలి. కొంతమంది మత్తయి 7:7-11లోని పోలికను వాక్యమునకు మించి వ్యాఖ్యానించారు. దీన్ని ఆధారం చేసుకుని సార్వత్రిక రక్షణను బోధించారు. "ప్రేమించే తండ్రి తన కుమారుని నిత్య శిక్షకు గురికానియ్యడు కాబట్టి దేవుడు ఎవరినీ కూడ నిత్య శిక్షకు గురి కానివ్వడు" అని వీరు వాదించారు. ఈ వాదనలో ఎన్నో తప్పులు మనకు కనబడుతాయి. ఉదాహరణకు, దేవుడు తన పిల్లలు అని గుర్తించిన వారి గురించి మాత్రమే ఈ వాక్య భాగం మాట్లాడుతుంది. అందరి గురించి కాదు.

ఈ వాదనలోనున్న ముఖ్యమైన సమస్య ఏమిటంటే, (మోషే చెప్పిన ప్రకారం), "దేవుడు *మానవుడు కాదు*" (సంఖ్యాకాండము 23:19; నొక్కి చేర్చబడింది). "నేనైతే యిలానే చేస్తాను, దేవుడు కూడ యిలానే చేయాలి" అని మనం అనకూడదు. అవిశ్వాసులు మరియు అవిధేయులు శిక్షనొందుతారని దేవుడే స్వయంగా చెప్పాడు (2 థెస్సలొనీకయులకు 1:7-9 చూడు). ఈ సత్యాన్ని నేర్చుకొనడానికి కొండమీది ప్రసంగంను వదిలి వెళ్ళనక్కరలేదు (మత్తయి 7:13, 14, 21-23ను చూడు). హరాల్డ్ ఫౌలర్ ఈ విధంగా వ్రాస్తున్నాడు, "ఎవరిలో అయితే

క్షమింపబడని పాపాలు ఉంటాయో వారు నిత్య శిక్షకు పాత్రులు అన్న విషయం దేవుడు ఏర్పరచినది. దీని గురించి మానవుడు దేవునితో వాదించడం అవివేకం."[1]

సూచన

[1]Harold Fowler, *Matthew I,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1968), 413.